క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



అద్దాలు పంపిణీ చేస్తున్న సీహెచ్‌ఓ

శిరివెళ్ల: కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాల పరిధిలో 30 మంది క్షయ వ్యాధిగ్రస్తులున్నారని వారికి తగిన వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, సూపర్‌వైజర్ శివ, ఆశా వర్కర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్వ్యూలు

ఉయ్యాలవాడ: స్వయం ఉపాధి కోసం కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు రెండో రోజు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సర్వాయిపల్లె, కొండుపల్లె, తుడుమలదిన్నె గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులు హాజరు కావాల్సి ఉండగా 17 మంది మాత్రమే హాజరయ్యారు. వీరికి సంజామల కెనరా బ్యాంకు అసిస్టెంటు మేనేజర్ సునీల్‌కుమార్, ఆళ్లగడ్డ ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ క్రిష్ణమూర్తి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు వెల్లడించారు.

తిక్కస్వామి దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా



దర్గాలో ఫాతెహాలు చదివిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సాయిబాబానగర్‌లో వెలసిన తిక్కస్వామి దర్గాను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి దర్శించుకున్నారు. దర్గా ఉరుసులో భాగంగా ఆయన ప్రత్యేక ఫాతెహాలు చదివించి చాదర్‌ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, దేశం సుధాకర్‌రెడ్డి, రహంతుల్లా, రసూల్ ఆజాద్, దేవనగర్ బాషా, జలీల్, పెద్దకబీర్, చిన్నకబీర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

శిరివెళ్ల: గుండెపోటుతో మృతి చెందిన వనికినిదిన్నె వీఆర్‌ఏ మాబుషా (42) కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. వీఆర్‌ఏ మృతి నేపథ్యంలో శుక్రవారం ఆమె గ్రామానికి చేరుకొని నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబసభ్యులకు రూ. 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల(వ్యవసాయం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఉందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పాకా సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. శుక్రవారం బడ్జెట్‌పై ప్రముఖులు, మేధావులు, కార్యకర్తలతో స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చూపు యువత భవిష్యత్తు, దేశ అభివృద్ధిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీజేకే మూర్తి, మేడా మురళీధర్, ఇంటి ఆదినారాయణ, సుధాకర్, ఉపేంద్రారెడ్డి, లక్ష్మీప్రసన్న, రమేష్‌బాబు, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఖలీల్ సిద్ధిఖీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శారదాబాయి పాల్గొని క్షయవ్యాధి ఏ విధంగా సోకుతుంది. లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్స, వ్యాధి నిర్ధారణ పరీక్షల గురించి వివరించారు.

రుణమేళాపై సమాచారం లేక..




దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

గోస్పాడు: బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు శుక్రవారం మండలకేంద్రం గోస్పాడులో నిర్వహించిన మేళాకు స్పందన కరువైంది. సరైన సమాచారం లేక చాలా మంది దరఖాస్తుదారులు మేళాకు హాజరుకాలేదు. మండల పరిధిలో 355 మంది దరఖాస్తు చేసుకోగా 195 మంది మాత్రమే హాజరైనట్లు ఎంపీడీఓ అమానుల్లా తెలిపారు.

రోడ్డెక్కని ఉచిత బస్సు

- ఎన్నికల హామీల అమలులో కూటమి సర్కారు విఫలం
- అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా కార్యరూపం దాల్చని ఉచిత బస్సు ప్రయాణం
- సర్కారు తీరుపై మహిళలు ఆగ్రహం
- బాబును నమ్మి మోసపోయామని ఆవేదన



నంద్యాల(అర్బన్): ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు సూపర్-6 హామీలతో ఊదరగొట్టాయి నమ్మి ఓటేసిన ప్రజలకు అధికారంలోకి వచ్చాక చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. సూపర్-6లో ప్రధానమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నేటికీ రోడ్డెక్కలేదు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా హామీకి మోక్షం లభించకపోవడంతో మహిళలు పెదవివిరుస్తున్నారు. అమలు చేయలేనప్పుడు ఎన్నికల సమయంలో హామీలు ఎందుకివ్వాలని పాలకులను ప్రశ్నిస్తున్నారు.

5 లక్షల మంది మహిళలకు మోసం

నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో దాదాపు 5లక్షల మంది మహిళలు ఉన్నారు. ఉచిత బస్సు హామీ అమలు చేస్తే వీరందరికీ ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఏరు దాటేదాక ఓడ మల్లన్న, ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్లుంది కూటమి ప్రభుత్వ పాలకుల తీరు. ఎన్నికల సమయంలో మహిళల ఓట్ల కోసం చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దానిని అటకెక్కించారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు మరోసారి తన నైజాన్ని ప్రదర్శించారని మహిళలు మండిపడుతున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు వివిధ పనుల మీద నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వం ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని వాపోతున్నారు.

కాలయాపన చేయడం సరికాదు



మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుచేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా, కాదా అని కూటమి నాయకులు ఆలోచన చేయాలి. అధికారంలోకి వచ్చాక అధ్యయనం, విధివిధానాల పేరుతో కాలయాపన చేయడం సరికాదు. ఏదిఏమైనా ఉచిత బస్సు హామీని సర్కారు తక్షణమే అమలు చేయాలి.

–శంకర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి, నంద్యాల

ఉచిత బస్సు హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో ఉచిత బస్సు ప్రయాణమంటే నమ్మాం. అధికారంలో వచ్చి 9 నెలలవుతున్నా అమలు చేయడం లేదు. ఇప్పటికైనా కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని పక్కాగా అమలు చేశాయి. మన రాష్ట్రంలో ఆ ఊసే ఎత్తక పోవడం శోచనీయం. కనీసం ఎప్పటి నుంచి హామీని అమలు చేస్తారో ప్రకటించాలి.

–కమాల్‌బీ, కానాల గ్రామం, నంద్యాల మండలం

లక్ష్యంతో చదవాలి



ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: చిన్నప్పటి నుంచే లక్ష్యం పెట్టుకొని చదవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు విద్యార్థులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో కళలు కని చదివిస్తుంటారని, వారి ఆశలను వమ్ము చేయరాదని చెప్పారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, వసతి గృహాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఉన్నత చదువులకు 10వ తరగతి అత్యంత కీలకమని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి శంకర్ పాల్గొన్నారు.

అహోబిలేశుడికి నీరాజనం



ఆర్.నాగులవరంలో ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న గ్రామ సర్పంచ్

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఊరేగుతున్న అహోబిలేశుడికి భక్తులు నీరాజనం పలుకుతున్నారు. తమను చల్లగా చూడాలని పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకీ శుక్రవారం ఆర్.నాగులవరానికి చేరుకుంది. గ్రామ సర్పంచు గంధం సావిత్రమ్మ, ఆమె భర్త ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేశారు. వారు తీసుకొచ్చిన పూజా సామగ్రిని అర్చకులు స్వామి వారికి సమర్పించారు. రాత్రికి స్వామి వారి పల్లకీ మండలంలోని తువ్వపల్లెకు చేరుకుంది. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు నల్లబోతుల సింహం తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు

నంద్యాల(న్యూటౌన్): సివిల్ సప్లయ్ హమాలీ కూలీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రెండో రోజు ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా నేటి వరకు పెంచిన కూలీ రేట్లను విడుదల చేయలేదన్నారు. ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. ఇప్పటికే 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలీల నిధులు విడుదల కాక కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఈనెల 28వ తేదీలోపు సమస్య పరిష్కారం కాకపోతే మార్చి 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులంతా నిరవధిక సమ్మె చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఇక్రా పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మించిన ఇక్రా పాఠశాల ఏడేళ్లుగా నిర్వహణ లేక నిరుపయోగంగా ఉందని, అందులో ఉర్దూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం కోరారు. మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉర్దూ భాష మధురమైనది చెప్పారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్, మహబూబ్‌బాషా, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

రీ- సర్వే త్వరగా పూర్తి చేయండి

శిరివెళ్ల: భూ రీ- సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డీఓ విశ్వనాథం అన్నారు. జీనేపల్లెలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆర్‌డీఓ పరిశీలించారు. గ్రామంలో గల భూమి, రైతుల వివరాలు, సర్వే పురోగతిని తహసీల్దార్ పుష్పకుమారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 1,667 ఎకరాల భూమి, 675 మంది రైతులున్నారని ఆమె వెల్లడించారు. ఇంత వరకు 25 శాతం సర్వే పూర్తయిందని, మార్చి చివరిలోపు వందశాతం పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చిన్న మల్లయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి

గోస్పాడు: జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు స్థానిక మోడల్ పాఠశాలలో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించినట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం, పాఠశాల ప్రిన్సిపాల్ ఖాజాహుస్సేన్ తెలిపారు. కలెక్టర్ ఈనెల 20న ఆకస్మిక తనిఖీచేసి సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు. అలాగే పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం ఎంఈఓ అబ్దుల్‌కరీం, ప్రిన్సిపాల్ ఖాజాహుస్సేన్ పాఠశాలలో వివిధ పనులు చేపట్టారు. లైబ్రరీలో విద్యార్థులకు అనుకూలంగా కుర్చీలను వేసి సీటింగ్ విధానాన్ని సరి చేశారు. అలాగే మెట్ల పక్కన చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆళ్లగడ్డ: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న అన్నారు. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్‌ఫోన్లు అవసరానికి మించి వాడితే అనర్థాలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల మిషన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పశుసంవర్థక శాఖ డీఎల్‌డీఏ డా.మల్లన్న, ఆళ్లగడ్డ ఏడీ డా.వరప్రసాద్ హాజరై మాట్లాడారు. లేగదూడల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వాటికి పోషకాహారం అందించాలని రైతులకు సూచించారు. అనంతరం సుమారు 50 లేగ దూడలకు నట్టల నివారణ మందు తాపించి, దూడల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు మందగిరి సాయిబాబా, దీపాకుమారి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆత్మవిశ్వాసంతో ఉండాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని బాలా అకాడమీ పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆ పాఠశాలలో ఇంప్యాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి రోజూ మనం చేసే పని ఏదైనా సంతోషంగా ప్రారంభించాలన్నారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదవాలని, అప్పుడే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయండి

శిరివెళ్ల: 2025–26 గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికను త్వరగా తయారు చేయాలని ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిధుల లభ్యత, ఆదాయ వ్యయాలపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రణాళికలను ముందుగా పీఆర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. తర్వాత ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, చెడిపోయిన చేతి పంపులను యుద్ధ ప్రాతి పదికను తయారు చేయాలన్నారు. మెటీరియల్ మండల కార్యాలయంలో అందుబాటులో ఉందన్నారు.

డ్రాయింగ్‌లో ‘గురురాజ’ విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి డ్రాయింగ్ గ్రామర్ కాంపిటీషన్ పోటీల్లో నంద్యాల గురురాజ విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం ఆ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అభినందించి మాట్లాడారు. చింతన ప్రకాశం ఫౌండేషన్ చిత్రలేఖనం, ఇంగ్లిష్ గ్రామర్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించగా తమ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారన్నారు. 300 పాఠశాలల నుంచి 6వేల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. తమ విద్యార్థులకు బాల్యదశ నుంచే చిత్రలేఖనం, ఇంగ్లిష్ గ్రామర్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

కూరగాయల వితరణ

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి పట్టణానికి చెందిన మార్కెట్ ప్రసాద్ దంపతులు కూరగాయలు వితరణ చేశారు. ఉత్సవాల సమయంలో దేవస్థానంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి గత 18సంవత్సరాలుగా వారు కూరగాయలు పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం లారీలో కూరగాయలు లోడ్ చేసి పంపించారు.

శిల్పా మహిళా సహకార్ రుణాలను సద్వినియోగం చేసుకోండి



చెక్కులు పంపిణీ చేస్తున్న శిల్పానాగినిరెడ్డి

నంద్యాల(అర్బన్): శిల్పా మహిళా సహకార్ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని బ్యాంక్ చైర్ పర్సన్ శిల్పానాగినిరెడ్డి మహిళలకు సూచించారు. స్థానిక సమితి కార్యాలయ ఆవరణలో శుక్రవారం 160 మంది మహిళలకు రూ.24.12 లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి సాధిస్తుందని, వాటికి ఆర్థికాభివృద్ధి తోడైతే కుటుంబాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా బ్యాంక్ చైర్ పర్సన్ హరిలీలా, సమితి మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వీరుల చరిత్ర స్ఫూర్తిదాయకం



ఉయ్యాలవాడలో బుడ్డా వెంగళరెడ్డికి బహూకరించిన బంగారు పతకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఉయ్యాలవాడ : రేనాటి సూర్య చంద్రులైన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పేదల ఆకలి తీర్చిన బుడ్డా వెంగళరెడ్డిల చరిత్ర స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అభిప్రాయపడ్డారు. వీరు ఇద్దరు ఒకే గ్రామంలో జన్మించిన వారు కావడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. శుక్రవారం బుడ్డా వెంగళరెడ్డి వారసులైన బుడ్డా విశ్వనాథరెడ్డి గృహానికి కలెక్టర్ వెళ్లారు. 1866లో డొక్కల కరువు సంభవించినప్పుడు నాలుగు జిల్లాల ప్రజల ఆకలి తీర్చిన తీరును బుడ్డా విశ్వనాథరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. బుడ్డావెంగళరెడ్డి దాతృత్వాన్ని మెచ్చి నాడు విక్టోరియా మహారాణి ఆయనను సన్మానించి బంగారు పతకాన్ని అందజేసిందని తెలిపారు. అలాగే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను కూడా వారి వంశీయుల ద్వారా కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేనాటి సూర్యచంద్రుల సేవాసమితి సభ్యులు దూదేకుల బాబు, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నాటు సారా ఆరోగ్యానికి హాని



సుగాలిమెట్టలో నాటుసారాకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ కృష్ణమూర్తి

బొమ్మలసత్రం: నాటుసారా సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ పోలీసులు పాణ్యం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలతో పాటు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాణ్యం చెంచు కాలనీలో నాటుసారా విక్రయిస్తున్న జయంపు చిన్నారి నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండల సుగాలిమెట్ట గ్రామ శివారులో సారా బట్టీపై దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అనంతరం సుగాలిమెట్ట సర్పంచ్ దేవిబాయి ఆధ్వర్యంలో గ్రామస్తులతో నాటుసారా సేవించడం ద్వారా కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించామన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

మధురం..మన మాతృభాష



రుద్రవరంలో గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నంద్యాలలో వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి



చాగలమర్రిలో తెలుగుతల్లి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అపుస్మా యూనిట్ అధ్యక్షుడు అమీర్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): మాతృభాష మధురమైనదని..దానిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. మాతృభాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్యా సంస్థలు, సాహితీ సంస్థల్లో నిర్వహించిన వేడుకల్లో పలువురు ప్రముఖులు తెలుగు తల్లి చిత్ర పటానికి, తెలుగు తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం మాతృభాష మనుగడ కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు ఇతర భాషలు నేర్చుకుంటున్నా మాతృభాషను మరువకూడదన్నారు. సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి లీలం వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు అసదుల్లా హుసేన్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, సభ్యులు రామచంద్రమూర్తి, రామసుబ్బారెడ్డి, రహంతున్నిసా, భారతి, శ్రీలత పాల్గొన్నారు.



మోడల్ పాఠశాలలో వస్త్రంపై తెలుగు వర్ణమాలను లిఖించిన దృశ్యం

- పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడారు. మాతృభాషను పరిరక్షించి మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వస్త్రాలంకరణలో విద్యార్థులు కనువిందు చేశారు. కార్యక్రమంలో కళాశాల భాషోపాధ్యాయులు రామలింగారెడ్డి, మాదన్న, వెంకటలక్ష్మమ్మ, కుసుమకుమారి, విజయలక్ష్మి, శ్రీహరి, రామాంజనేయులు పాల్గొన్నారు.
- పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిభాషను గౌరవించడం, మాట్లాడటం, చదవటం చేయాలన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు పాల్గొన్నారు.
- **చాగలమర్రి:** మండలంలోని గోడిగనూరు గ్రామ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు పి.ఓబులపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ న్యామతుల్లా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాతృ భాష మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపమని చెప్పారు. అనంతరం విద్యార్థులు మాతృభాషలో ప్రసంగాలు, కవితల వాచనం, నాటికలు ప్రదర్శిస్తూ భాషా వైభవాన్ని చాటారు.
- మండల కేంద్రమైన చాగలమర్రిలోని శ్రీచైతన్య భారతి ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అపుస్మా ఆళ్లగడ్డ యూనిట్ అధ్యక్షుడు టి.అమీర్‌బాషా పాల్గొని మాట్లాడారు. మాతృభాషను మర్చిపోతే తల్లిని మర్చిపోయినట్లేనని చెప్పారు. పాఠశాల డైరెక్టర్లు చంద్రకళ, చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు డి.మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.
- **రుద్రవరం:** మండలంలోని ప్రభుత్వపాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తువ్వపల్లె తిప్పమీ దున్న ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు విద్యార్థులకు తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. వేడుకల్లో భాగంగా ఈ పాఠశాల విద్యార్థులు వర్ణమాలను వస్త్రాలపై ప్రత్యేక లిఖించి ప్రదర్శించారు.